క్లుప్తంగా

గృహలక్ష్మి పథకంతో మోసం

ఇల్లందకుంట: బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం పేరుతో పేదలను మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఇంగిలే రామారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.కవితను అరెస్ట్ చేయనప్పుడే ప్రజలు బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అనే నిర్ణయానికి వచ్చారని, బీజేపీకి ఓటు వేస్తే దుర్వినియోగం ఐనట్టేనని, పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు , సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.ఐదులక్షలు అందిస్తామని ప్రకటించి ప్రజలను మభ్యపెట్టిందన్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్నా లేకున్నా నిరుపేదలందిరికీ ఇల్లు కట్టుకోవడానికి ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్‌లో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కార్పొరేటర్ సల్ల శారద అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. మానేరు రివర్ ఫ్రంట్‌తో అంత్యక్రియలకు స్థలం కరువైందని లేఖ రాశారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మెయిన్‌రోడ్డు పక్కన దుకాణాల ఎదుట రేకులకు చుట్టిన విద్యుత్‌వైర్లను తాడికల్ సబ్‌స్టేషన్ ఏఈ సంపత్‌రెడ్డి పరిశీలించారు. వర్షాకాలంలో విద్యుత్‌షాక్ తగలకుండా వ్యాపారులు ప్లాస్టిక్ పైపుల్లో నుంచి విద్యుత్‌వైర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పేదలకు బీజేపీతోనే న్యాయం

చొప్పదండి: దేశంలోని ప్రతి పేదవాడికి పీఎం నరేంద్ర మోదీ నాయకత్వంలో న్యాయం జరుగుతోందని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాకుంట, ఆర్నకొండ గ్రామాలలో సోమవారం ఇంటింటికి బీజేపీలో భాగంగా పోస్టర్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, రాములు, వీరేశం, మహేశ్, వెంకటరమణారెడ్డి, అంజయ్య, శ్రీనివాస్, ఐలయ్య, హన్మంతు, అజయ్ పాల్గొన్నారు.

దారిలేక రైతుల అరిగోస

- మల్యాల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణంతో కష్టాలు
- నిల్వ నీటితో మునిగిపోతున్న దారి
- వంతెన నిర్మించాలని కోరుతున్న అన్నదాతలు
- సమస్యను పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్తున్న రైతులు


గండిని పూడ్చుతున్న దృశ్యం


చెక్‌డ్యామ్ పైభాగం కూల్చివేతతో తగ్గిన నీటిమట్టం

ఇల్లందకుంట: ఆ గ్రామంలోని రైతులు పొలాల వద్దకు వెళ్లాలన్నా.. పండించిన వ్యవసాయ ఉత్పత్తులను గమ్యస్థానాలకు చేర్చాలన్నా నడుము లోతు నీళ్లలోంచి వెళ్లాలి. వర్షాకాలంలో ఈదుతూ దాటాల్సిందే. ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామ పరిధిలోని వాగుపై భూగర్భ జలాలను పెంచడం కోసం ప్రభుత్వం నాలుగు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. నిర్మాణం రైతులకు ఓ వైపు వరం మరోవైపు శాపం. 2021లో రూ.1.10 కోట్లతో చెక్ డ్యామ్ పూర్తిచేయగా అదే ఏడాది భారీ వరదలకు నాణ్యతలోపంతో గండిపడింది. వారం రోజులుగా గండిని మట్టితో పూడ్చుతున్నారు. కానీ చెక్‌డ్యామ్ నిర్మాణంతో కొత్తగా దారి కష్టాలు మొదలయ్యాయి. నీటి నిల్వతో దారి పూర్తిగా మునిగిపోతుంది. వందల ఎకరాల పొలాలకు, గ్రామానికి మధ్య వాగు ఉండటంతో రైతులు వాగు దాటాల్సిందే. వర్షాకాలంలో నీటి ప్రవాహం తీవ్రంగా ఉన్నా వాగు దాటి పొలాల వద్దకు వెళ్లాల్సిందే. ప్రభుత్వం తక్షణం సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎరువులను భుజాలు, తలపై పెట్టుకొని నీటిలో నుంచి అతి కష్టం మీద పొలాల వద్దకు తీసుకెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలు వచ్చిన ప్రతిసారి తీవ్ర ఇబ్బందులు పడాల్సిందేనని అంటున్నారు. వాగుదాటి వ్యవసాయం చేస్తున్నాం పొలాల వద్దకు వెళ్లడానికి వంతెన నిర్మించాలని గ్రామస్తులు ఏళ్లుగా అధికారులు, పాలకుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

చెక్ డ్యామ్ నిర్మాణంతో

చెక్‌డ్యామ్ నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని వాగు పక్కన నుంచి రోడ్డు చేపట్టాలని రైతులు పలుమార్లు అధికారులు, పాలకులకు తెలిపినా ఫలితం లేదు. చెక్‌డ్యామ్ మరమ్మతు పనులు పూర్తయితే నీటి నిల్వతో పూర్తిగా రాకపోకలు నిలిచే ప్రమాదం ఉంది.

రెండు ఫీట్ల వరకు కూల్చివేత

వాగొడ్డు రామన్నపల్లి గ్రామానికి కింద మల్యాల సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహించే ప్రాంతానికి పక్కన 2019 సంవత్సరంలో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో చెక్‌డ్యామ్ నిర్మించగా బ్యాక్ వాటర్‌తో పంటలు మునిగి నష్టం వస్తుందని రైతుల ఫిర్యాదుతో ఇటీవల చెక్‌డ్యామ్‌ను రెండు ఫీట్ల వరకు అధికారులు కూల్చివేశారు. దీంతో నీటి నిల్వ లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సరైన అంచనా లేకుండా ఇంజినీరింగ్ లోపంతోనే పరిస్థితి తలెత్తిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెక్‌డ్యామ్‌తో ప్రజాధనం వృథా కావడమే కాకుండా నిరుపయోగంగా మారిందని అధికారుల తీరుపై అన్నదాతలు మండిపడుతున్నారు.

వాగు దాటాలంటే కష్టం



వ్యవసాయ పనుల కోసంనడుము లోతు నీటిలో నుంచి వెళ్లాలి. మూడెకరాల పొలంలో పండించిన పంట ఉత్పత్తులను ఇంటికి చేర్చడాకి కష్టమవుతుంది. దారిలేక పొలం గట్టుపై నుంచి ఎరువులు తీసుకెళ్లాలంటే కిలోమీటర్ మేర నడవాలి. గ్రావెల్ రోడ్డువేస్తే రాకపోకలు సులభతరమవుతుంది. అప్పుడప్పుడు నడిచే క్రమంలో ప్రమాదాల బారినపడుతున్నాం.

– బొమ్మ రమేశ్, రైతు, మల్యాల

పొలాల వద్దకు బాట వేయాలి



చెక్‌డ్యామ్ నిర్మాణంతో పంట పొలాల వద్దకు సరైన మార్గం లేక రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. వాగు ఒడ్డు పక్కన నుంచి దారి నిర్మాణం చేపట్టాలి. డ్యామ్ కట్టకముందు వాగులో నుంచి పోయేవాళ్లం. వర్షాకాలంలో అయితే వాగు దాటనిచ్చేది కాదు. పనులు వాయిదా వేసుకుంటాం . అధికారులు మా కష్టాన్ని చూడాలి.

– గురుకుంట్ల సారయ్య, రైతు, మల్యాల

నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు



ఇంజినీర్ల లోపం స్పష్టంగా కనబడుతుంది. గ్రామం చివరగా కట్టిన చెక్‌డ్యామ్ ఏడాదికే చిన్నపాటి వరదకే తెగిపోయింది. సమ్మక్క గద్దెల వద్ద కట్టిన చెక్‌డ్యామ్‌తో పొలాలు మునుగుతున్నాయని రైతుల ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు కొంత భాగం కూల్చివేస్తే నీటి నిల్వలేకుండా పోయింది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– మాదారపు రత్నాకర్, సామాజిక ఉద్యమకారుడు

- **కలెక్టర్‌కు ఫిర్యాదు**

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామస్తులు తారురోడ్డు నిర్మాణం ఆపాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తారురోడ్డు పనుల్లో భాగంగా ఓవైపు డ్రైనేజీ నిర్మించి రెండోవైపు డ్రైనేజీ నిర్మించకుండానే రోడ్డు వేస్తున్నారని, రెండువైపులా డ్రైనేజీ నిర్మించాకే రోడ్డు వేయాలని కలెక్టర్‌కు వివరించారు.

- **ఎల్‌వోసీ అందజేత**

రామడుగు: మండలంలోని గుండి గ్రామానికి చెందిన బాలిక జుమేరా ఫిరదోస్ నిమ్రా(12) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చికిత్స కోసం రూ.రెండులక్షల యాభై వేల ఎల్‌వోసీని సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

- **పర్యావరణంపై దృష్టి సారించాలి**

చొప్పదండి: రైతులు విభిన్న పాటల సాగు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. మండల పరిషత్‌లో సోమవారం వ్యవసాయ పంటల సాగుపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో స్వరూప, ఏవో వంశీకృష్ణ, సాయికుమార్, ప్రసన్నకుమార్, రాజశేఖర్, తదితరులున్నారు.

- **నేడు రక్తదాన శిబిరం**

హుజూరాబాద్: పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆద్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డిపో మేనేజర్ పి.అర్పిత మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30–సాయంత్రం 3 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు.

- **బంద్ విజయవంతం**

చొప్పదండి/హుజూరాబాద్/శంకరపట్నం:ఏబీవీపీ పిలుపు మేరకు వివిధ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు సోమవారం బంద్ పాటించాయి. నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

- **నలుగురిపై కట్నం కేసు**

జమ్మికుంట: కట్నం కోసం వేధింపులకు పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాధాకృష్ణ తెలిపారు.మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన లావణ్యకు 11 ఏళ్ల క్రితం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన వీరగోని రాజుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నకానుకలు ముట్టజెప్పారు. కొంతకాలంగా భర్త రాజు, అత్త సుశీల, మరుదులు తిరుపతి, సదానందం అదనపు కట్నం రూ.లక్ష తీసుకురావాలని లావణ్యను మానసికంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి


జమ్మికుంట: ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు


శంకరపట్నం: కేశవపట్నంలో..

జమ్మికుంట: మంచి సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలని పట్టణ సీఐ బార్పటి రమేశ్ అన్నారు. సోమవారం పట్టణంలో మిషన్ పరివర్తన్‌లో భాగంగా పోలీసులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ప్లకార్డులతో మాదక ద్రవ్యాల నిర్మూలనపై పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ రమేశ్, ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ తరలించడం, వాడినట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ యూనీస్ అహ్మద్ అలీ, ఏఎస్ఐలు రాధాకృష్ణ, రవి, హెచ్ఎం సదానందం, సుధాకర్, అవినాశ్, ఎన్‌సీసీ కెడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరపట్నం: డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కేశవపట్నంలో విద్యార్థులతో కలిసి పోలీసులు బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి దశ కీలకమని బాగా చదుకోవాలని హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్ సూచించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మోడల్‌స్కూల్‌లో పుస్తక పఠనోత్సవం నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎస్సై చంద్రశేఖర్, ప్రిన్స్‌పాల్ జ్యోతి అభినందించారు.

ఇల్లందకుంట: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేకదినోత్సవం పురస్కరించుకొని ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు వేణు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలి


జమ్మికుంట:మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్


చిగురుమామిడి: చిన్నముల్కనూర్‌లో..

జమ్మికుంట: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో ఆసక్తి, నైపుణ్యం పెరుగుతుందని ఎంఈవో విడుపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండాఉపయోగించే విధంగా చూడాలన్నారు. పురప్రముఖులు, తల్లిదండ్రులను ఆహ్వానించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయాలన్నారు. హెచ్ఎంలు డి.సుధాకర్, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మొబైల్స్‌కు అలవాటు పడకుండా పుస్తక పఠనం ద్వారా విద్యార్థులను నియంత్రించడం సాధ్యమవుతుందని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పుస్తక పఠనం వైపు విద్యార్థులను మళ్లించేందుకు టీచర్లు కృషి చేయాలన్నారు. పుస్తక పఠనం నింతరం కొనసాగే ప్రక్రియ అని అన్నారు. ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, ఏఎంవో అశోక్‌రెడ్డి, ఎస్ఈఆర్‌టీ రాంబాబు, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహించారు. విద్యార్థుల్లో చదివే అలవాటును అభివృద్ధి చేసేందుకు పఠనోత్సవం నిర్వహించామని టీచర్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబయ్య, విజేందర్‌రెడ్డి, వేణు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సేవలతోనే గుర్తింపు


సురేష్‌ను సన్మానిస్తున్న చొప్పదండి క్లబ్ సభ్యులు

చొప్పదండి: నిరంతర సేవలతో చొప్పదండి లయన్స్ క్లబ్ ప్రజల్లో ప్రత్యేకతను సంతరించుకుందని లయన్స్ క్లబ్ చార్టర్ గవర్నర్ చిదుర సురేష్ అన్నారు. చొప్పదండి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ సేవలు విస్తృతమయ్యాయని, రీజియన్‌లో ఉత్తమ క్లబ్‌గా చొప్పదండి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. మరిన్ని సేవలతో క్లబ్‌కు వన్నె తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం క్లబ్ నూతన అధ్యక్షుడు మహేశుని మల్లేశం, కార్యదర్శి దూస రాము, కోశాధికారి మామిడి రాజేశ్ పవార్, ఉపాధ్యక్షుడు గొల్లపల్లి నరేశ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ కోఆర్డినేటర్ సుధాకర్, మార్కెటింగ్ చైర్మన్ జితేందర్, సర్వీస్ చైర్మన్ లక్ష్మయ్య, మెంబర్‌షిప్ చైర్మన్ లక్ష్మీకాంతం, క్లబ్ డైరెక్టర్స్ భద్రేశం, ఆనందం, క్రిష్ణహరి, శ్రీనివాస్, భూమయ్య, రవి, రీజియన్ చైర్మన్ రాజయ్య, చిరంజీవాచారి, అంజనేయులు, విజయ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థిని ఎంపిక

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని గూడిపాటి అనూష రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైంది. దేశవ్యాప్తంగా ఐదు వేల మందిలో అనూష ఒకరు కావడంపట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి విద్యార్థినిని అభినందించారు. ఉన్నత చదువుల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యుత్ రంగంలో అపార అవకాశాలు



మాట్లాడుతున్న శంకర్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం ఈసీఈ విద్యార్థుల కృతజ్ఞత సభ నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శంకర్ మాట్లాడారు. విద్యుత్ రంగంలో విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా సాంప్రదాయేతర ఇంధన వనరుల నుంచి విద్యుత్ ఉత్పత్తి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. రవాణా రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలు వస్తాయన్నారు. అనంతరం అధ్యాపకులను విద్యార్థులు సత్కారించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ యోగేశ్ యశ్వంత్ పుండలిక్, రిజిస్టర్ పి వెంకటయ్య , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి డా. కే విజయలక్ష్మి, అకాడమిక్ కోఆర్డినేటర్ జి మల్లయ్య, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు

చిగురుమామిడి: రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు చిగురుమామిడి సింగిల్‌విండోలో అందుబాటులో ఉన్నాయని చైర్మన్ జంగ వెంకట్రమణారెడ్డి తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు వానాకాలం పంట రుణాలు, దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు ఇస్తున్నామని చెప్పారు. సమావేశంలో పలువురు డైరెక్టర్లు, రైతులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్‌నంటూ రైతుకు ఫోన్

శంకరపట్నం: పోలీసుస్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నా.. మీ భూమిని చూసినం.. ట్రాక్టర్‌తో దున్నుకోనివ్వ అని మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన రైతు మొకిరాల లక్ష్మణ్‌రావుతో మహిళా కానిస్టేబుల్ మాట్లాడటం చర్చానీయంశమైంది. లక్ష్మణ్‌రావుకు మరో రైతుతో భూ సమస్య ఉంది. ఈక్రమంలో పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ రావడంతో అనుమానం వచ్చి కుమారుడితో సోమవారం ఎస్సై చంద్రశేఖర్‌ను ఆశ్రయించారు. ఫోన్‌లో మాట్లాడిన వివరాలను ఎస్సైకు వివరించారు. స్టేషన్ నుంచి ఇతరులు ఫోన్‌లో మాట్లాడారని, ఫోన్ చేసింది ఎవరో తెలుస్తామని ఎస్సై తెలిపారు.

రూ. ఐదులక్షల చొప్పన ఆర్థికసాయం

చిగురుమామిడి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు గీతకార్మికులు ప్రమాదాలకు గురికాగా ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందింది. రామంచ గ్రామానికి చెందిన బొమ్మగాని రాజయ్య ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి కాలు విరిగి అంగవైకల్యంతో బాధపడుతుండగా సోమవారం హైదరాబాద్‌లోని కోకాపేటలో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రూ.ఐదులక్షల చెక్కు అందించారని గీతకార్మిక సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి తెలిపారు. సుందరగిరికి చెందిన తాళ్లపల్లి రాజయ్య చెట్టుపై నుంచి పడి చేయి విరిగిపోగా కరీంనగర్ ఎక్సైజ్ భవన్‌లో సూపరింటెండెంట్ శ్రీనివాసరావు రూ. ఐదు లక్షల చెక్కు అందించారు. రేకొండ గ్రామానికి చెందిన పడాల రాయమల్లు చెట్టుపై నుంచి పడగా వైద్యఖర్చుల నిమిత్తం రూ.పదివేల చెక్కు అందించామని తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో పలువురు గీతకార్మిక సంఘం నాయకులు ఉన్నారు.

'ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించం'


సమావేశంలో మాట్లాడుతున్న జీవీఆర్

మానకొండూర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని, నాలుగు పార్టీలు మారిన రాజకీయ బ్రోకర్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడాచైర్మన్ జీవీ రామకృష్ణారావు విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థి ఎవరో చెప్పే దమ్ముందా, నియోజకవర్గంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అభివృద్ధి పనులు చేస్తుంటే కళ్లులేని కబోదిలా మాట్లాడుతున్నాడని అన్నారు. గతంలో 66వేల ఎకరాలకు ఎల్ఎండీ ద్వారా సాగునీరు అందితే తెలంగాణ వచ్చాక లక్షా ముప్పై రెండు వేల ఎకరాలకు సాగునీరందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. ఎమ్మెల్యే రసమయిని స్థానికేతరుడు అంటూ అపహాస్యం చేస్తున్న కవ్వంపల్లి నీ స్వగ్రామం పచ్చునూర్‌లో ఎన్ని రోజులు నిద్రపోయావన్నారు. ప్రజాసంగ్రామంలో ఎక్కడి నుంచి అయినా పోటీచేయడానికి అవకాశం ఉందన్న విషయం తెలియదా అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పథకాలలో అవినీతి జరిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని, అవగాహన లేకుండా మాట్లాడవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు రామంచ గోపాల్‌రెడ్డి, పి.మధు, ఎస్. శంకర్, ఎం. కొండయ్య, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ వ్యతిరేకులకే మంత్రి పదవులు'


నవాబుపేట్‌లో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

చిగురుమామిడి: తెలంగాణ ఏర్పాటును అడ్డుకున్న వారే రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నవాబుపేట్‌లో పల్లెపల్లెకు ప్రవీణన్న, గడపగడపకూ కాంగ్రెస్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగారు. గ్రామ చౌరస్తాలో మాట్లాడుతూ... ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని, ఎన్నికల హామీలను సీఎం కేసీఆర్ నెరవేర్చలేదన్నారు. ఎమ్మెల్యేకు నియోజకవర్గ రైతుల గోస పట్టడంలేదని, ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని, అధికారంలోకి వస్తే ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ, రూ.ఐదువందలకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. సొంత స్థలంలో ఇల్లు కోసం రూ. ఐదులక్షలు అందిస్తామన్నారు. ఆయా పార్టీల నుంచి పలువురు యువకులు, రైతులు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్, అధికార ప్రతినిధి సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నవాబుపేట్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భారతీదేవి, షాబుద్దీన్, మహిపాల్‌రెడ్డి, సంపత్, లచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేందర్‌సింగ్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

- **రైతు బాంధవుడు సీఎం కేసీఆర్**

గన్నేరువరం: సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని రైతు బంధు సమితి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ గుడెల్లి తిరుపతి అన్నారు. సోమవారం గుండ్లపల్లిలో మాట్లాడారు. పెట్టుబడి కింద ఎకరాకు రూ. ఐదు వేల ఆర్థికసాయం అందిస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాడని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడుతుందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

- **లక్ష్మీపూర్‌లో వైద్యశిబిరం**

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో న్యాయవాది కనకం వంశీ, వైద్యులు కృష్ణ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని తహసీల్దార్ రాజ్‌కుమార్ ప్రారంభించారు. హెచ్ఎం శ్వేత, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.


- **ఇంటింటికి కవ్వంపల్లి**

మానకొండూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు.

- **పాఠశాలకు బీరువా అందజేత**

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 1996–97 పదో తరగతి విద్యార్థులు చదువుకున్న పాఠశాలకు సోమవారం బీరువా అందజేశారు. హెచ్ఎం కాత్యాయని, పూర్వ విద్యార్థులు సాజిద్‌అలీ, గురప్పా, శ్రీనివాస్‌రరెడ్డి సందీప్, రాజు, మహేందర్, టీచర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు వినతి


చొప్పదండి: వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

చొప్పదండి: ప్రతి నెలా మొదటి తేదీన పెన్షన్ చెల్లించాలని, కనిష్ఠ పెన్షన్ రూ.30 వేలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు కె.భూమయ్య, ప్రధాన కార్యదర్శి కె.రాజేశం, కోశాధికారి కె.సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు తహసీల్దార్ రాజుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కర్ర శ్యాంసుందర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు కర్ర రాజిరెడ్డి, ముదుగంటి రాజిరెడ్డి పాల్గొన్నారు.